పౌష్టికాహారంతో ఎదుగుదల


సైదాపురం: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

చిల్లకూరు: చిన్నారులకు తల్లిపాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం అందిస్తే ఎదుగుదల బాగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నెల రోజులుపాటుగా నిర్వహించనున్న పౌష్టికాహార మాసోత్సవాలను శుక్రవారం చిల్లకూరులోని వడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిర, కమల పాల్గొన్నారు.

ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ

సైదాపురం: గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దనే వైఎస్సార్ సంపూర్ణ పోషణ వస్తువులను అందజేస్తున్నామని సీడీపీఓ సునంద తెలిపారు. మండలంలోని చాగణం, సైదాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనమ్మ, రాధిక పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిరూరల్: పట్టణంలోని బంగారుపేట, రూరల్ మండలంలోని దాచెరువు అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ శంషాద్‌బేగం పాల్గొన్నారు..

వైభవంగా లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కోట: గ్రామదేవత కోటమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. సుధాకర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు లక్ష కుంకుమార్చన చేసి, అమ్మవారికి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ ఏ రమణయ్య, కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీకాళహస్తీశ్వరుడి కల్యాణం


శ్రీకాళహస్తీశ్వరస్వామి కల్యాణోత్సవం చేస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారి కల్యాణోత్సవం శుక్రవారం నాయుడుపేటలో శ్రీకాళహస్తి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయం ధర్మ ప్రచార రథం నాయుడుపేటకు చేరిన క్రమంలో శుక్రవారం పట్టణంలోని స్వర్ణముఖినది తీరంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద ముక్కంటికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి, కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. అన్నపూర్ణేశ్వరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఓ ముద్దుకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో డీ వెంకటకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వీ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గూడూరురూరల్: మున్సిపాలిటీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పలు వార్డుల్లో జరుగుతున్న సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాల ను ఆర్డీఓ కిరణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ జీజీఎంపీ కింద 124 పనులకు సంబంధించి రూ.6 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. 100 పనులు నాన్ టెండర్ కింద, 24 పనులకు టెండర్ల ద్వారా పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఆ పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసమూర్తి ఉన్నారు.

చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు

డక్కిలి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్, ఆ పార్టీలు నాయకుడు అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు శుక్రవారం డక్కిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి సోషల్‌మీడియా కో– కన్వీనర్ పరుచూరి రమేష్‌గౌడ్, డక్కిలి మండల కన్వీనర్ పీ అనీల్ కుమార్‌యాదవ్, కో–కన్వీనర్ శివకోటి, కె సాయియాదవ్, రాజశేఖర్, అభిరామ్ పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు : రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియ సభ్యులు శుక్రవారం రాపూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కో–కన్వీనర్ కొప్పుల ఎల్లయ్య, సోషల్ మీడియా కన్వీనర్లు మతకాల సుబ్రమణ్యం, గుమ్మ వెంకటేశ్వర్లు, దమ్మాయిరామ్, పెంచలయ్య పాల్గొన్నారు.

లారీ బోల్తా

దొరవారిసత్రం: నెలబల్లి సమీపంలో చెన్నై నుంచి నెల్లూరుకు మొక్కజొన్నల లోడ్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పి శుక్రవారం రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ తిరుమలరావు పరిశీలించారు.

నాయుడుపేటకు చేరిన విద్యార్థి మృతదేహం


రోదిస్తున్న కుటుంబసభ్యులు

నాయుడుపేటటౌన్ : నంద్యాల జిల్లా పాణ్యం మండలం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాయుడుపేటకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి అమరావతి పరమేష్(25) మృత్యువాత పడ్డాడు. సూళ్లూరుపేట అగ్నిమాపక శాఖ కార్యాలయంలో లీడింగ్ ఫైర్‌మన్ ఏసీ బాబు కుమారుడైన పరమేష్ నంద్యాలలో ఎంబీబీఎస్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. పాణ్యం నుంచి స్నేహితుడితో కలసి బైక్‌పై వస్తుండగా లారీ బైక్‌ను ఢీకొనడంతో పరమేష్ అక్కడిక్కడే మరణించాడు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత పరమేష్ మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం నాయుడుపేటకు తీసుకువచ్చారు. పరమేష్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

ఫ్లైఓవర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: పట్టణంలో ఫ్లైఓవర్ పునర్నిర్మాణ పనులు ప్రారంభించామని, ఆ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ మాధవీసుకన్యను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే శుక్రవారం విజయవాడలో ఆమెను కలిసి వినతిప్రతం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, ఈఈ, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులతో పాటు సంబంధిత కాంట్రాక్టర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. ఈనెల 15వ తేదీన చీఫ్ ఇంజినీర్ గూడూరుకు వస్తారని తెలిపారు. డిసెంబరు నాటికి ఐసీఎస్‌రోడ్డు నుంచి చవటపాళెం వరకు ఉన్న బ్రిడ్జిని పూర్తి చేస్తామని, అలాగే ఐసీఎస్ రోడ్డు నుంచి జయంపు వెళ్లే మార్గంలోని బ్రిడ్జి ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారని చీఫ్ ఇంజినీర్‌కు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమారుడు నవీన్‌గుప్త

గూడూరురూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి సోషల్ మీడియా ప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు తనయుడు వెలగపల్లి నవీన్‌గుప్త కోరారు. ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం మధ్యాహ్నం పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ ఆర్ శ్రీనివాసులు, కో కన్వీనర్లు సీ రుదీప్‌రెడ్డి, ఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఉంచుకోండి

నాయుడుపేట: కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారి తనిఖీకి రానున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాను సక్రమంగా రూపొందించి, ఉంచుకోవాలని తహసీల్దార్ రాజేంద్ర సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఓటరు జాబితాపై అధికారులతో సమావేశం నిర్వహించారు. వారం రోజుల్లో కేంద్ర బృందం ఓటరు నమోదు, బోగస్ ఓట్లు, డబుల్ ఎంట్రీలు, డెత్ క్లెయిమ్‌లు, వలస ఓట్లు తదితర అంశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు.

ఎల్ఐసీ వారోత్సవాలు ప్రారంభం

గూడూరురూరల్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో శుక్రవారం బ్రాంచ్ మేనేజర్ మధుబాబు ఆ సంస్థ వారోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ జగదీష్ చంద్ర, ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ జనార్దన్, కనకయ్య, పీపీ నాగరాజు, విజయభాస్కర్, శివకుమార్ పాల్గొన్నారు.

సవరించిన ఓటర్ల తుది జాబితా సిద్ధం

తడ: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి అన్ని అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ఓటర్ల తుది జాబితా సిద్ధం చేసినట్టు సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని తెలిపారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీఓ ఓటర్ల జాబితా పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో 436 మంది చనిపోగా డబుల్ ఎంట్రీలు, ఊరు విడిచి శాశ్వతంగా వెళ్లిపోయినవారు అందరినీ గుర్తించి మొత్తం 1,286 ఓట్లను తొలగించినట్టు తెలిపారు. కొండూరులో 6 ఓట్లకు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పరిశీలించి అవన్నీ సక్రమంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారని తెలిపారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ జయజయరావు ఉన్నారు.